క్లుప్తంగా

బదిలీ ఉద్యోగులకు సన్మానం



బదిలీపై వెళ్తున్న వీఆర్వోలను సన్మానిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: బదిలీపై వెళ్తున్న వీఆర్వోలను స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మండలంలోని కొలగానహళ్లి వీఆర్వో కుళాయిస్వామి, కురువళ్లి వీఆర్వో రవికిరణ్ బదిలీపై వెళ్తుండటంతో వారికి తహసీల్దార్ మునివేలు శాలువా పుష్పగుచ్ఛాలతో సన్మానించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వోలు నరసింహమూర్తి, రామన్న, యుగేంధర్, నాగరాజు, శృతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలను మోసం చేసేందుకు 'కూటమి' పన్నాగం

కణేకల్లు: రాష్ట్రంలో ఉండే ఆడబిడ్డలను కూటమి ప్రభుత్వం మోసం చేసేందుకు పన్నాగం పన్నుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కన్నారి ఉషారాణి అన్నారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల ముందు 18 ఏళ్లున్న ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి పథకం కింద ప్రతి నెలా నెలా రూ.1500 ఇస్తానని ఓట్లు వేయించుకొన్న చంద్రబాబు నేడు ఈ పథకాన్ని అమలు చేయకుండా ప్లాన్ చేస్తున్నారన్నారు. 18 ఏళ్ల మహిళలకు రూ.1500 ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాల్సి వస్తోందని అచ్చెంనాయుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మీకు తెలియదా? అని కూటమి నేతలను ఆమె ప్రశ్నించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

ఆర్డీటీ కోసం పోస్టుకార్డుల ఉద్యమం



పోస్టుకార్డులు చేతబట్టుకొని ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కణేకల్లు: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్డీటీ మద్దతుదారులు చేపట్టిన లక్ష పోస్టుకార్డుల ఉద్యమంలో విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. సేవ్ ఆర్డీటీ కణేకల్లు మండల ఇన్‌చార్జ్ టీ.వెంకటేశులు, మద్దతుదారులు దాయనిధి, గోపాల్‌ల ఆధ్వర్యంలో కేజీబీవీ, మోడల్ స్కూల్, ప్రభుత్వ కాలేజీ, హిందూ బాలికల హైస్కూల్ విద్యార్థులతో పాటు స్థానికులు ర్యాలీగా ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయాలని పోస్టుకార్డులో రాసి కేంద్రహోం మంత్రి అమిత్‌షాకు పోస్టు పంపారు. ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయకపోవడంతో పేదలు తీవ్రంగా నష్టపోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. సేవ్ ఆర్డీటీ కోసం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని వారు పిలుపు నిచ్చారు.

26న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

కూడేరు: మండల కేంద్రంలోని శివరావు ఫంక్షన్ హాల్‌లో ఈనెల 26న ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. సమావేశానికి ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వర రెడ్డి, పార్టీ జిల్లా నేతలు హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నేతలు, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి, మండల నేత శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్లను అందజేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండల పరిధిలోని తగ్గుపర్తి గ్రామంలో బుధవారం గ్రామ స్వరాజ్, ఇన్ఫిన్స్ ఫౌండేషన్ సహకారంతో 50 శాతం సబ్సిడీపై 30 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. సంస్థ ఫౌండేషన్ చైర్మన్ విజయ్ కిషోర్‌కు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మౌనిక, మాజీ సహకార సంఘం అధ్యక్షుడు వెంకట నాయుడు, స్థానికులు రాధాకృష్ణ, జయరాములు, జిల్లా సమన్వయకర్త సరస్వతి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ పర్యటన

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయ కర్త తలారి రంగయ్య గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని కార్యాలయం ప్రతినిధులు బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి పార్టీ శ్రేణులు ఆయన్ను కలవొచ్చని పేర్కొన్నారు.

అంతా కంపు.. కంపు



మధు థియేటర్ వెనుక ఉన్న వీధిలో రోడ్డుపై పారుతున్న మురుగు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 17వ వార్డు మధు థియేటర్ వెనుక వీధిలో మురుగురు నీటి వ్యవస్థ సక్రమంగా లేక రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉంటోంది. దీంతో వాహనదారులు, పాదాచారులు మురుగునీటిని దాటుకునే వెళ్లాల్సి వస్తోంది. మురుగు కంపుతో పాటు రోగాలు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. గుంతలు, మట్టి దిబ్బలతో రోడ్డు రాకపోకలకు అనువుగా లేకుండా పోయిందని, రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలు పెరిగాయని చెబుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టు ఏర్పాటు చేయడంతో పాటు ముళ్లకంపలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మందుబాబులకు అడ్డేదీ?



కూడేరులో సచివాలయం-2 ఎదుట బీర్‌బాటిల్, సీసాలు, వ్యాటర్ ప్యాకెట్లు పడేసిన దృశ్యం

కూడేరు: ప్రభుత్వ కార్యాలయాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ, వెలుగు, ఉద్యాన, సచివాలయం-1, 2 కార్యాలయాలు ఉన్నాయి. రోజూ చీకటి పడితే చాలు మందు బాబులు ఆయా కార్యాలయాల ముందు భాగంలో తిష్ట వేసి మద్యం సేవిస్తుంటారు. ఖాళీ బాటిల్స్, వాటర్, ఇతర స్నాక్స్ ప్యాకెట్లు అక్కడే వదిలేసి పోతుంటారు. ఉదయాన్నే అధికారులు కార్యాలయానికి వచ్చినపుడు మద్యం బాటిల్స్, వాటర్, స్నాక్స్ ప్యాకెట్ల కవర్లను తొలగించడం అధికారులకు దినచర్యగా మారుతోంది. కార్యాలయాల పక్కన కుప్పలుగా వ్యాటర్ ప్యాకెట్లు, మద్యం సీసాలు కనిపిస్తున్నాయి. ఎంపీడీఓ కార్యాలయానికి ప్రధాన గేటు ఉన్నా మూయకపోవడంతో మందుబాబులు లోపలికి వస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

నీటి వృథాను అరికట్టరా?



లీకేజీతో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోట మారెమ్మగుడికి వెళ్లే దారిలో మాజీ కౌన్సిలర్ రఘురాం ఇంటికి కొద్దిదూరంలోనే రెండు చోట్ల తాగునీటి పంపింగ్ పైప్ లైన్‌కు భారీస్థాయిలో లీకేజీలు ఉన్నాయి. రోజూ నీరు రోడ్డు పాలవడమేకాక కలుషితమవుతున్నట్లు కాలనీవాసులు తెలిపారు. ఇటీవల రెండు, మూడు సార్లు లీకేజీలను సిబ్బంది సరిచేసినా ప్రయోజనం లేదన్నారు. శాశ్వతంగా లీకేజీలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే

ఉరవకొండ: సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. అడ్డమైన హామీలు ఇచ్చి చంద్రబాబు మహిళలను నిలువునా మోసం చేశారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ సుశీలమ్మ ధ్వజమెత్తారు. బుధవారం ఉరవకొండ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలంటూ మంత్రి అచ్చెన్న చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాట్లు తెలిపారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేసేందుకు చేతకానపుడు ఎన్నికల ప్రచారంలో ఎందుకు హామీ ఇచ్చారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం మహిళలతో పాటు అన్నీ వర్గాలను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆడబిడ్డ నిధి కింద రూ.1,500 ఇస్తామని మొదటి ఏడాది ఎగ్గొట్టారని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు అమలుకు సాధ్యం కానీ హామీలు ఇవ్వడం అధికారంలోకి రాగానే మహిళలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. రాష్ట్రంలోని మహిళలను మోసగించిన చంద్రబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. ఆడబిడ్డ నిధి కోసం రాష్ట్రాన్ని అమ్మేయాలంటూ వాఖ్యలు చేసిన మంత్రి అచ్చెన్న మహిళలకు క్షమాపణ చెప్పాలని కోరారు. కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, మేజర్ పంచాయతీ సర్పంచ్ మీనగ లలితమ్మ, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు గురికాల ఓబుళమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుశీలమ్మ

హనుమాన్ దర్శన్‌కు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

రాయదుర్గంటౌన్: శ్రావణమాసంలో వ్యాసరాయ ప్రతిష్ఠిత ఆంజనేయస్వామి దేవాలయాల దర్శనం కోసం రాయదుర్గం డిపో నుంచి హనుమాన్ దర్శన్ పేరిట ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు.డీ హీరేహాళ్ మండలం మురడి ఆంజనేయస్వామి, బొమ్మనహాళ్ మండలం నేమకల్లు అంజనేయస్వామి, గుంతకల్లులోని కసాపురం ఆంజనేయస్వామి ఆలయాలను ఒకే రోజు దర్శనం చేసుకునేలా బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి శని, మంగళవారాల్లో బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ నెల 26, 29, ఆగస్టు 2, 5, 9, 12, 16,19 తేదీల్లో రాయదుర్గం డిపో నుంచి ప్రత్యేక హనుమాన్ దర్శన్ బస్సులు బయల్దేరుతాయన్నారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద నుంచి ఉదయం 6.30 గంటలకు పై తేదీల్లో మూడు దేవస్థానాల దర్శనం కోసం బయల్దేరుతాయన్నారు. రాయదుర్గం నుంచి రానుపోను పెద్దలకు చార్జీ రూ.350, పిల్లలకు రూ.180 ఉంటుందన్నారు. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కోసం 9959225863, 7382862408, 7013463879, 9490414623 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



సీనియర్ పాత్రికేయుడి మృతి



పరమేశ్వరప్ప (ఫైల్)

గుమ్మఘట్ట/రాయదుర్గం: గుమ్మఘట్ట మండలం నేత్రపల్లికి చెందిన సీనియర్ పాత్రికేయుడు పరమేశ్వరప్ప (60) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన గత 25 ఏళ్లుగా వివిధ దిన పత్రికల్లో రిపోర్టర్‌గా పనిచేశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య మంజుల అంగన్‌వాడీ టీచర్‌గా ఉన్నారు. పరమేశ్వరప్ప మృతదేహం వద్ద విలేకర్ల సంఘాల నేతలు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు నివాళులర్పించారు.

బాధితుడికి పరామర్శ



ఆర్థిక సాయం అందిస్తున్న కృష్ణమూర్తి

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు మండలం రాంపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత చితకాయల చిరంజీవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిందే. అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడిని బెస్తరపల్లి జీకే కృష్ణమూర్తి బుధవారం పరామర్శించారు. వైద్య ఖర్చుల కోసం రూ.50 వేలు చిరంజీవికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక దళితులపై దాడులు అధికమయ్యాయని, వాటిని అరికట్టాలని ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు చెలిమప్ప అన్నారు. శెట్టూరు మండలం ఐదుకల్లు గ్రామంలో మొహర్రం సందర్భంగా అదే గ్రామానికి చెందిన దళితులను ఆలయంలో మొక్కులు తీర్చుకోవడం కోసం వెళ్లకుండా అదే గ్రామానికి చెందిన కొందరు అడ్డుకున్నారన్నారు. గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపి వేసి దళితులను భయపెట్టారన్నారు. ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు గోవిందప్ప, రామాంజనేయులు, బాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండలంలో దళితులపై దాడులను అరికట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ ఈశ్వరమ్మకు బుధవారం వినతి పత్రం సమర్పించారు. దళితులపై దాడికి పాల్పడినవారిపై అధికారులు చర్యలు చేపట్టడం లేదన్నారు. దీంతో దాడులు అధికమవుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సాకే గురుమూర్తి, మండల అధ్యక్షుడు తిప్పేస్వామి, నాయకులురామమూర్తి, మారెన్న, మహేష్, పాలాక్షి, ఉదయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

స.హ చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏఓ సాయికుమార్



సూచనలిస్తున్న ఏఓ శుభకర్

బొమ్మనహాళ్: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి సాయికుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని ఏలంజి గ్రామంలో మండల సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రతి పౌరుడికి సమాచార హక్కు చట్టం బ్రహ్మాస్త్రం లాందన్నారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ఏఓ పృథ్వీసాగర్, హెచ్ఓ కృష్ణ తేజ తదితరులు వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పౌరుడు అడిగిన సమాచారాన్ని 30 రోజుల గడువులోపు అందించాలన్నారు. లేకపోతే రాష్ట్ర సమాచార కమిషన్ తీసుకునే చర్యలకు బాధ్యులు అవుతారని తెలిపారు.

కూడేరు: సమాచార హక్కు చట్టం ప్రజలకు ఒక వజ్రాయుధంలాంటిదని మండల వ్యవసాయాధికారి శుభకర్ అన్నారు. బుధవారం కూడేరులోని వ్యవసాయ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన సమాచారాన్ని ఎవరైనా సమాచార హక్కు చట్టం మేరకు కోరవచ్చన్నారు. అందుబాటులో సమాచారం లేకపోతే సంబంధిత ఉన్నతాధికారికి సదరు దరఖాస్తును బదలాయించాల్సి ఉంటుందన్నారు. ఆ సమాచారం ఇవ్వడానికి వీలుపడని పక్షంలో దరఖాస్తుదారుడికి లిఖిత పూర్వకంగా తెలియజేయాల్సి ఉంటుందన్నారు. 30 రోజుల్లో కోరిన సమాచారాన్ని పూర్తి స్థాయిలో ఇవ్వకపోతే సమాచార హక్కు కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కమిషనర్ విచారణ జరిపి సమాచారాధికారికి జరిమానా విధిస్తూ క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి కార్యాలయం వద్ద సమాచార హక్కు చట్టం బోర్డు ఏర్పాటు చేసి అందులో పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి పేరు, హోదా, ఫోన్ నంబర్ పొందుపరచాల్సి ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, ఏఈఓలు దిలీప్ కుమార్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

కుందుర్పి: బెస్తర్లపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వక్తలు ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. వచ్చే విద్యాసంవత్సరంలో టెన్త్‌లో ప్రథమస్థానంలో వచ్చిన వారికి రూ.5 వేలు నగదు బహుమతి ఇవ్వనున్నట్లు పూర్వ ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ ప్రకటించారు. బదిలీపై వెళుతున్న మరో ఉపాధ్యాయురాలు మంజుళ విద్యార్థులకు ప్యాడ్‌లను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజు, ఉపాధ్యాయులు చెన్నరాయప్ప, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేజీబీవీలో బాలికలపై దాడికి యత్నిస్తున్న కోతులు

వామ్మో కోతులు..!

కూడేరు: మండల కేంద్రంలోని కేజీబీవీలో కోతుల బెడద అధికమైంది. ఉపాధ్యాయులు, బాలికలు హడలెత్తిపోతున్నారు. రెండు నెలలుగా గదుల్లోకి ప్రవేశించి బాలికలు భద్రపరుచుకున్న బట్టలు ఇతర వస్తువులు, పుస్తకాలను లాగేసి పడేస్తున్నాయి. స్టోర్ గదిలోకి వెళ్లి వంట సామగ్రిని ధ్వంసం చేస్తున్నాయి. ఇక తరగతి గదుల్లోకి వెళ్లి బాలికలు, ఉపాధ్యాయులపై దాడికి యత్నిస్తున్నాయి. భోజనం సమయంలో కోతులు ఎక్కడ దాడి చేస్తాయో అని బాలికలు భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని బాలికలు, సిబ్బంది కోరుతున్నారు.

నేడు చౌడేశ్వరి జయంత్యుత్సవం



విద్యుత్ వెలుగుల్లో ఉరగాద్రి చౌడేశ్వరీ ఆలయం

ఉరవకొండ: పట్టణంలోని ఉరగాద్రి చౌడేశ్వరీ అమ్మవారి జయంతి వేడుకలకు ఆలయం ముస్తాబైంది. ఎంతో విశిష్టత కలిగిన ఈ ఆలయంలో అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. అమ్మవారి జయంతి సందర్భంగా పల్లకీ సేవ, విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం బ్యారిగేట్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి జిల్లాకు చెందిన ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులు కుడా తరలిరానున్నారు. ఆలయ చైర్మన్ కొత్త శరత్ అధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమంతో పాటు భక్తులకు ఉచితంగా మోగా హెల్త్ క్యాంపు నిర్వహించనున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న డీవైఈఓ మల్లారెడ్డి

బొమ్మనహాళ్: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో సమస్యలు పరిష్కారం అవుతాయని డీవైఈఓ మల్లారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వ్యవసాయం, విద్య, వైద్యం, అటవీశాఖ, అంగన్‌వాడీ, ఉపాధిహామీ, ఉద్యానశాఖ, తాగునీరు, వెలుగు తదితర శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ మధుసూదన్, వైస్ ఎంపీపీ పుష్పావతి, ఎంఈఓ-2 హరికృష్ణ, ఏఓ పృథ్వీసాగర్, వైద్యాధికారులు కార్తీక్‌రెడ్డి, రుషికేష్, హెచ్ఓ కృష్ణ తేజ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హర్షవర్ధన్, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో హల్‌చల్

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక దొడగట్ట రోడ్డు వద్ద బుధవారం ఉదయం ఓ తాగుబోతు మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. కళాశాలకు వెళుతున్న విద్యార్థినులు, మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తూ.. చేతిలో కత్తి, బ్లేడ్ పట్టుకుని అందరినీ భయపెట్టాడు. పలుమార్లు ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా.. నివారణ చర్యలు చేపట్టడంలో పోలీసులు విఫలమయ్యారని, దీంతో తరచూ తాగుబోతులు తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారంటూ విద్యార్థినులు, స్థానిక మహిళలు వాపోయారు.



కళ్యాణదుర్గంలో నడిరోడ్డుపై భయభ్రాంతులకు గురి చేసిన తాగుబోతు

చిన్నపాటి వర్షానికే ఇలా..



గాంధీ చౌక్ వద్ద నీటికుంటను తలపిస్తున్న ప్రధాన రహదారి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో రహదారులు చిన్నపాటి వర్షానికే కుంటలను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం పట్టణంలో చిన్నపాటి వర్షం కురిసింది. దీంతో నీరంతా రోడ్డుపై చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఎస్ఎస్ ట్యాంకుకు నీటి పంపింగ్ ప్రారంభం



నీటి పంపింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలవ, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: పట్టణానికి తాగునీటిని అందజేసే డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెచ్చెల్సీ శాశ్వత మంచి నీటి పథకం కింద కణేకల్లులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులోకి హెచ్చెల్సీ కెనాల్ నుంచి తుంగభద్ర జలాల పంపింగ్‌ను బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ పొరాళ్ల సురేష్, కౌన్సిల్ సభ్యులు హాజరు కాగా పూజలు చేసి మోటార్లు ఆన్ చేసి నీటి పంపింగ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గొని లావణ్య, ప్రశాంతి, జ్యోతి, పొరాళ్ల గోవిందరాజులు, శివపుత్ర, ఫకృద్దీన్, కోఆప్షన్ సభ్యుడు నజీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పొరాళ్ల శివకుమార్, నిజాముద్దీన్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకూ నీళ్లందిస్తాం

కణేకల్లు: హెచ్చెల్సీ చివరి ఆయకట్టు రైతులకు ఏ కష్టం రానివ్వకుండా సక్రమంగా నీరందిస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. హెచ్చెల్సీకి అనుబంధంగా ఉన్న కణేకల్లు చెరువులో బుధవారం ఎమ్మెల్యే గంగపూజ చేసి చీర, సారే సమర్పించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని హెచ్చెల్సీ ఆయకట్టు రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. రైతులకు సాగునీటి సమస్య రాకుండా చూసుకొనే బాధ్యత తనదేనన్నారు. హెచ్చెల్సీ సబ్‌డివిజన్ డీఈఈ దివాకర్‌రెడ్డి, ఏఈఈ నరేంద్ర మారుతి తదితరులు పాల్గొన్నారు.